W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక





ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

26-7-2025



## గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గిరిజన ( ఆదివాసి )యువత భవిష్యత్తు కోసం ఆర్థికంగా, నైపుణ్య పరంగా ఎదగాలని జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరా బాదులోని కేంద్ర ప్రభుత్వ నేషనల్ లెవెల్ శిక్షణ సంస్థ "నేషనల్ స్కిల్స్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ (ఎన్ ఎస్ టి ఐ) " లో ప్రత్యేకంగా అమలు చేస్తున్న ఫర్నిచర్ ప్రొడక్షన్ అసిస్టెంట్ కోర్సులో మొదటి దశగా మన జిల్లాలోని పది మంది గిరిజన యువతకు అవకాశం కల్పించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

02



06



# ఆకస్మిక తనిఖీలతో హడల్

## వైద్య సేవల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఫైర్

### పీహెచ్‌సీని వెంటనే తరలించాలని ఆదేశాలు

స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్య సేవలు పట్ల జిల్లా కలెక్టర్ అనుదీఫ్ దురిశెట్టి అసంతృప్తిని వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ను ఆకస్మింకగా తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. వార్డులకు వెళ్లి పరిశీలించారు. ఓపీ లో వెయిట్ చేస్తున్న రోగుల వద్దకు వెళ్లి పలకరించారు. ఎక్కడి నుంచి వచ్చారు..ఏమైంది అమ్మా అంటూ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది తో ప్రత్యేకంగా మాట్లాడారు..సీహెచ్సీలో ఈ నెలలో కేవలం రెండు కాన్పులు చేయటం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు.

నేలకొండపల్లి, మహా



## ఉప్పొంగుతున్న గోదావరి..

- డేంజర్ బెల్స్
- తాలిపేరు-కిన్నెరసాని వరద జలాలు
- ప్రాణహిత-ఇంద్రావతితో కలసి గోదావరి వేగం
- గంటల వ్యవధిలో 5 అడుగుల పెరుగుదల
- తాలిపేరు 7 గేట్లు ఎత్తి 18,659 క్యూసెక్కుల నీరు విడుదల
- కిన్నెరసాని రెండు గేట్లు ఎత్తి 8 వేల క్యూసెక్కుల నీరు విడుదల

07

## పేదవాడి కల సాకారం అయింది

### ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలను కొత్తగూడెం క్లబ్‌లో మరియు పాల్వంచ కనకదుర్గ ఫంక్షన్ హాల్ నందు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.





05

## తల్లాడ ఆసుపత్రిని సందర్శించిన అదనపు కలెక్టర్, డిఎంహెచ్ వో

తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా వైద్య అధికారి కళావతి భాయ్ శుక్రవారం సందర్శించారు. అనారోగ్యంతో మృతిచెందిన యోగా ట్రైనర్ కందుల శ్రీదేవి మృతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.



03

## గడపగడపకు సంక్షేమం

### కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ చేసిన కోరం

ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రజల ఇంటి వద్దకే వెళ్లి కళ్యాణలక్ష్మీ పథకం చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరవేస్తూ, ఎమ్మెల్యే స్వయంగా బండి నడుపుతూ లబ్ధిదారుల ఇళ్లను సందర్శించారు.

# గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ

## యువత భవిష్యత్తుకు భద్రత కోసం ఫర్నిచర్ తయారీలో శిక్షణా కార్యక్రమం

## పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన 30 సంవత్సరాల లోపు గిరిజన యువకులకు అవకాశం



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 25 (మహా):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గిరిజన ( ఆదివాసి )యువత భవిష్యత్తు కోసం ఆర్థికంగా, నైపుణ్య పరంగా ఎదగాలని జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాదులోని కేంద్ర ప్రభుత్వ నేషనల్ లెవెల్ శిక్షణ సంస్థ "నేషనల్ స్కిల్స్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ (ఎన్ ఎస్ టి ఐ) " లో ప్రత్యేకంగా అమలు చేస్తున్న ఫర్నిచర్ ప్రొడక్షన్ అసిస్టెంట్ కోర్సులో మొదటి దశగా మన జిల్లాలోని పది మంది గిరిజన యువతకు అవకాశం కల్పించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఈ కోర్స్ మూడు నెలల పాటు కొనసాగుతుంది. కోర్సు ఫీజు రూ.5 వేలు కాగా, వసతి, భోజనానికి కలిపి మొత్తం రూ.15 వేల వరకు ఖర్చవుతుందని తెలిపారు. కోర్సు ఫీజు 5 వేల రూపాయలను జిల్లా యంత్రాంగం ద్వారా భరించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. మన జిల్లా అటవీ ప్రాంతం కావడం వల్ల టింబర్, ఇతర చెక్క సామాగ్రి అందుబాటులో ఉండటం వల్ల ఫర్నిచర్ రంగంలో యువతకు అవకాశాలు ఉన్నాయి. అందుకే ఈ కోర్సు ఎంపిక చేయడం జరిగింది అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ శిక్షణ పూర్తి చేసిన అనంతరం నెలకు రూ.15 వేల పారితోషకంతో శిక్షణ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఎన్ ఎస్ టి ఐ నుండి శిక్షణ పొందిన వారికి హైదరాబాదులోని ప్రఖ్యాత సంస్థల నుండి తక్షణమే అప్రెంటిషిప్ అవకాశాలు లభిస్తాయి. శిక్షణ అనంతరం బ్యాంకుల సహకారంతో స్వయం ఉపాధి అవకాశాలను కూడా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కోర్సు ద్వారా ప్రత్యేకంగా ఎస్టీ (ఆదివాసీ) యువతకు ప్రయోజనం కలిగేలా ప్రణాళిక రూపొందించినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ దూరంగా ఉందని, ఒంటరిగా ఉండాలంటే ఎలా అని భయపడకుండా ఆసక్తి గల ఆదివాసి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం వచ్చే దఫాల్లో బాలికలకు కూడా ఈ అవకాశాన్ని అందుబాటులోకి తీసుకురానున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశం ద్వారా మీరు ఉద్యోగం పొందవచ్చు లేదా స్వయం ఉపాధి ప్రారంభించవచ్చు. మీ భవిష్యత్తు కోసం మూడు నెలలు కష్టపడండి అని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఫర్నిచర్ రంగంలో నైపుణ్యం పొందిన యువతకు దేశవ్యాప్తంగా అవకాశాలు న్నాయి. ఇది భవిష్యత్ నిర్మాణానికి మనం వేసే ఒక మెట్టు అని అన్నారు. ఈ శిక్షణపై ఆసక్తిగల యువతకు అవగాహన కల్పించేందుకు జూలై 29న ఉదయం 11:00 గంటలకు జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించబోయే అవగాహన కార్యక్రమానికి 30 ఏళ్ల లోపు వయస్సు కలిగిన ఆదివాసి యువకులు హాజరై తమ పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ముమ్మరంగా డ్రైనేజీలు పూడికతీత పనులు




**కూసుమంచి, జులై 25, మహా:** కూసుమంచి మండలం జీళ్ళచెరువు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పంచాయతీ కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల పర్యవేక్షణలో ఏళ్ళ తరబడి పూడిపోయి ఉన్న కచ్చ డ్రైనేజీలను శుభ్రం చేశారు. ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు, కచ్చ డ్రైనేజీలు గత పదేళ్ళుగా పూడిక తీయకపోవడంతో అవి పూడిపోయి వరద నీరు ఇండ్లలోకి వచ్చి, చిన్న పాటి వర్షానికి జలమయమవుతున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు రావడం కాలనీ ఇండ్లలోకి వెళ్ళడంతో ఇళ్ళు జలమయమైయ్యాయి. దీంతో స్పందించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, పంచాయతీ కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో డ్రైనేజీలను పూడిక తీయించారు. దీంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మాణం చేసి శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు. కాగా నాయకులు స్పందించి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి ఈ విషయాన్ని, కాలనీ పరిస్థితిని వివరించి సీసీ, డ్రైనేజీలు నిర్మాణం చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండ్ర అంజయ్య, కొండా శ్రీనివాస్ రావు, గోపి లక్ష్మయ్య, సిబ్బంది గోపి రమేష్, కత్తి వెంకటేశ్వర్లు, బాలబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.

# మధిర అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులపై బీజేపీ ఆగ్రహం



**మధిర, మహా:** మధిర మున్సిపాలిటీలో జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మధిర టౌన్ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. శివరాజ్ సుమంత్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు మున్సిపాలిటీ ఎదుట నిరసన తెలిపారు. వర్షాకాలంలో నాసిరకంగా మరియు నత్తనడకన సాగుతున్న డ్రైనేజ్ పనులు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని బీజేపీ మండిపడింది. మట్టి పూర్తిగా నింపకపోవడం వల్ల తక్కువ వర్షానికే రోడ్లు గుంతలతో నిండిపోతున్నాయని, వాటిలో వాహనాలు ఇరుక్కుపోతున్నాయని వారు తెలిపారు. పాఠశాల బస్సులు, చిన్నపిల్లలు కూడా రోడ్ల పరిస్థితుల వల్ల ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి కారణమైన మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్కపై బీజేపీ మండిపడింది. కమిషన్ల కోసమే పనులను నిర్లక్ష్యంగా చేస్తున్నారు అని విమర్శించింది. అధికారులు వెంటనే స్పందించి నాణ్యతా లోపాలపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే దశలవారీగా ఉద్యమం చేపడతామని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, మన్ కి బాత్ స్వర్ణాకర్, కుంచం కృష్ణారావు, పాపట్ల రమేష్, పగడాల నాగేంద్రబాబు, మాదిరాజు సాయిరామ్, రామకృష్ణ, బొడ్డు ఆంజనేయులు, మాధవసాయి, ఎం.డి. గౌస్, పింజారి ఖాజామియా తదితరులు పాల్గొన్నారు.

# జీళ్ళచెరువులో వానరానికి అంత్యక్రియలు



**కూసుమంచి, జులై 25:** ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం జీళ్ళచెరువు గ్రామంలో శ్రావణ శుక్రవారం విద్యుత్ షాక్ తో కోతి మృతి చెందింది. గ్రామ పంచాయతీ కాంప్లెక్స్ పైనా కోతులు తిరుగుతుండగా కరెంట్ వైర్ తగిలి ఓ పెద్ద కోతి విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో గ్రామస్థులు పెండ్ర అంజయ్య ఆధ్వర్యంలో కోతికి ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామం మొత్తం ఊరేగింపు నిర్వహించారు. ప్రజలందరు పాల్గొని సంబురంగా కోతికి అంత్యక్రియలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెండ్ర అంజయ్య, మాజీ సర్పంచ్ కొండా సత్యం, అంబాల లింగయ్య, కొండా శ్రీనివాస్ రావు, గుండమాల గాంధీ, గోపి శ్రీను, బెజవాడ శ్రీకాంత్, ఐతగాని కోటి, గోపయ్య, కిషోర్, వెంకన్న, ఎల్లయ్య, వీరబాబు, హుస్సేన్, బాలకృష్ణ, నాగేశ్వరరావు, రోశయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో ఫ్రైడే-డ్రై డే కార్యక్రమం నిర్వహణ

**మధిర, మహా:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నిర్వహించే "ఫ్రైడే – డ్రై డే" కార్యక్రమాన్ని శుక్రవారం మధిర మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ గారి ఆధ్వర్యంలో పలు వార్డుల్లో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ం వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండే చోట్లను శుభ్రంగా ఉంచుకోవాలని, ఉపయోగంలో లేని కూలర్లు, తొట్టిలు, టైర్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గోపాల్ రావు, వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, ఆశ వర్కర్లు, హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# గడపగడపకు సంక్షేమం

## ఇల్లందులో కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ చేసిన కోరం కనకయ్య

**ఇల్లందు, మహా:** ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రజల ఇంటి వద్దకే వెళ్లి కళ్యాణలక్ష్మీ పథకం చెక్కులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరవేస్తూ, ఎమ్మెల్యే స్వయంగా బండి నడుపుతూ లబ్ధిదారుల ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎమ్మెల్యేకు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బోడా మంగిలాల్, మాజీ చైర్మన్లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... "బీఆర్ఎస్ హయంలో గడీల పాలన సాగితే, కాంగ్రెస్ హయంలో పేదల గడపలో సంక్షేమ పథకాలు నేరుగా చేరుతున్నాయి" అన్నారు. ప్రజల అవసరాలు



తెలుసుకుంటూ, వారి మద్దతుతో ప్రభుత్వం నడుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ఇల్లందు మున్సిపాలిటీలోని అన్ని 24 వార్డుల్లో జరుగుతుంది. కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళా కమిటీ, యూత్ కాంగ్రెస్, ఐఎన్టీయూసీ నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ చేయాలి

**టేకులపల్లి - మహా :** టేకులపల్లి మండల సేవాలాల్ సేన అధ్యక్షులు, భూక్య దేవ్ సింగ్ నాయక్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించడం జరిగింది అందులో భాగంగా సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు శివ నాయక్ మాట్లాడుతూ... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయి, రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ చేయాలని, యూరియా కోసం లైన్లు కట్టకుండా మండలానికి రెండు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు ఇబ్బంది పడకుండా చూడాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వానికి కోరుతా ఉన్నము, అదేవిధంగా పోడు భూములకు సర్వే జరిగి కొంతమందికి పట్టాలు రాని వాళ్ళు కొంతమంది, పోడు భూములు పట్టాలు ఉన్నవాళ్లకు కరెంట్ లైన్ బోర్లు వేయించిన వాళ్లకు ఫారెస్ట్ అధికారులు ఇబ్బందికి గురి చేస్తా ఉన్నారు, అలాంటి ఇబ్బంది జరగకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య దేవ్ సింగ్ నాయక్, రాజా నాయక్, సునీల్ నాయక్, రూపుల నాయక్, మానిసింగ్ నాయక్, లచ్చు నాయక్, నరేష్ నాయక్, కుమార్ నాయక్ తదితరులు రైతులు పాల్గొన్నారు

## మొక్కలు నాటిన సులానగర్ వైద్య సిబ్బంది



**టేకులపల్లి - మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశానుసారం సులనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 100 మునగ మొక్కలు ఇతర మొక్కలు 100 ఔషధ మొక్కలు నాటారు ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జయలక్ష్మి, ఎంపీడీవో ఎల్. మల్లీశ్వరి, వైద్యాధికారులు డాక్టర్ కందుల దినేష్ డాక్టర్ కంచర్ల వెంకటేష్ డాక్టర్ మధు వరుణ్ లు స్వయంగా మొక్కలు నాటారు ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ వృక్షాలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో కూడా మునగ మొక్కలు మరియు ఇతర ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లు వజ్జా పార్వతి, పాయం శ్రీనివాస్ స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్వేత పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ ఆరోగ్య విస్తరణాధికారి దేవా సూపర్వైజర్లు గుజ్జా విజయ కౌసల్య సింగ్ నాగు బండి వెంకటేశ్వర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## పారిశుద్ధ్యం మరచిన అధికారులు



**మహా భద్రాచలం:** అశోక్ నగర్ కొత్త కాలనీలో పారిశుధ్యం లోపించిందని, స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి లు అన్నారు. సిపిఎం బృందం వివిధ కాలనీలలో నెలకొన్న సమస్యలపై పర్యటించారు. అనేక పర్యాయాలు గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. అశోక్ నగర్ కొత్త కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, అనేక నెలలుగా డ్రైనేజీ పూడిక తీయకపోవడం తో పిచ్చి మొక్కలు, పిచ్చి చెట్లు పెరిగి అడవిని తలపిస్తున్నాయని అన్నారు. దోమలు విపరీతంగా పెరిగి డెంగ్యూ మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## సొసైటీల తనిఖీ

**కూసుమంచి, జులై 25, మహా:** కూసుమంచి మండలంలోని జక్కేపల్లి, కల్లూరుగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నాట్లు ప్రారంభమైనందున రైతులకు అందుబాటులో యూరియా నిల్వలను ఉంచాలని, రైతుల అవసరాలకు అనుగుణంగా ఉదయం 8 గంటల నుండి ఎరువులను పంపిణీ చేయాలని సూచించారు . ఎరువుల విక్రయాన్ని పిఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే జరపాలని, రైతు వారీగా యూరియా విక్రయాలను నమోదు చేయాలని , రైతులకు కనపడే విధంగా ఎరువుల నిల్వల వివరాలను తెలుపుతూ స్టాక్ బోర్డును ప్రతిరోజూ ప్రదర్శించాలని తెలియజేశారు. అనంతరం జక్కేపల్లి లోని వరి పొలాలను పరిశీలించారు. వరిలో కాలిబాటలు తీయడం ద్వారా మొక్కకు అవసరమైన గాలి, వెలుతురు సమృద్ధిగా అందుతుందని, ఈ విధంగా చేయడం వల్ల చీడపీడల ఉధృతిని ముఖ్యంగా సుడిదోమను అరికట్టవచ్చని, పురుగుమందులు మరియు ఎరువుల పిచికారీకి కూడా అనువుగా ఉంటుందని, ప్రతి రెండు మీటర్లకు మధ్యలో 20 సెంటీమీటర్లు వదిలేస్తూ కాలిబాటలు ఏర్పరచుకోవాలని సూచించారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**మధిర,మహా:** మధిర పట్టణం, మండలంలో పలువురికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫార్సుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్ల సాయి చేతుల మీదుగా అందజేశారు. మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొత్తం 47 మంది లబ్ధిదారులకు 17 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని, రాష్ట్రంలో వైద్యం, విద్యకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పెద్దపీట వేస్తున్నారని అన్నారు.

# పేదవాడి కల సాకారం అయింది

## కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

## అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు: కలెక్టర్ జితేష్

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 25 (మహా):** కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలను కొత్తగూడెం క్లబ్‌లో మరియు పాల్వంచ కనకదుర్గ ఫంక్షన్ హాల్ నందు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలకి ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న పేదవారి కల నేడు సాకారమైంది. గత ప్రభుత్వ కాలంలో రేషన్ కార్డుల పంపిణీ ఆగిపోవడంతో పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సమర్థంగా రేషన్ కార్డుల పంపిణీ చేపట్టింది అని తెలిపారు. ఇప్పటివరకు కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో మొత్తం 4,633 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయగా 7,962 కార్డుల్లో కుటుంబ సభ్యుల వివరాలు జతపరచడం జరిగింది. కొత్తగూడెం మండలంలో ప్రత్యేకంగా 1,733 కొత్త కార్డులు మంజూరు కాగా, 2,188 కార్డుల్లో కుటుంబ సభ్యుల వివరాలు చేర్చారు. ఇంకా దాదాపు 2,000 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, 600 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని చెప్పారు. పాల్వంచ మండల పరిధిలో



నూతనంగా 1,727 మరియు కుటుంబ సభ్యుల వివరాలు జతపరిచినవి 3584 కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. గతంలో దొడ్డు బియ్యంతో పేదలకు ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం నాణ్యతతో పాటు, వారి ఆకలిని తీర్చడమే కాక, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోంది. ఈ తరహా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టాలని కోరుతున్నాం, అని శాసనసభ్యులు అన్నారు. కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ... కొత్తగూడెం నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేశాం. తక్కువ సమయంలోనే దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి, మంజూరు ప్రక్రియ చేపట్టాం. అలాగే, కుటుంబ సభ్యుల వివరాలను కూడా సమగ్రంగా నవీకరణ చేశాం, అని తెలిపారు. ప్రభుత్వం పేదవారి కోసం సరఫరా చేస్తున్న సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకొని వారు ఆర్థికంగా ముందుకెళ్లాలని కోరుకుంటున్నాం. ఇంకా ఎవరికైనా రేషన్ కార్డు మంజూరు కాకపోతే, వారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని కలెక్టర్ వెల్లడించారు. అనంతరం శాసనసభ్యులకు కూనంనేని సాంబశివరావు మరియు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ చేతుల మీదుగా లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారిని రుక్మిణి, సంబంధిత శాఖల అధికారులు, రేషన్ కార్డుల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## :వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: హరిప్రియ నాయక్



**ఇల్లందు, మహా:** ఇల్లందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శ్రీమతి బానోతు హరి ప్రియహరిసింగ్ నాయక్ వర్షాకాలం నేపథ్యంలో ప్రజలను అప్రమత్తంగా ఉండాలంటూ విజ్ఞప్తి చేశారు. గత ఐదు రోజులుగా తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. తడిచిన చేతులతో ఎలక్ట్రిక్ స్విచ్ బోర్డులు, కరెంట్ స్తంభాలను తాకవద్దని హెచ్చరించారు. వర్ష ప్రభావం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో రాబోయే రెండు మూడు రోజులు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్న పిల్లలు చెరువులు, వాగులు, కుంటలు, కాలువల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీరు పోటెత్తే వాగులు చూడటానికి బయటకు వెళ్లడం, సెల్ఫీలు తీసుకోవడం వలన ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించారు. ప్రజలు తమ ప్రాణాలకు ముప్పు తలెత్తకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హరిప్రియ నాయక్ తెలిపారు.

## అప్రమత్తంగా ఉండండి



**టేకులపల్లి - మహా :** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించండి అని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నియోజకవర్గంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదల సంభవించే ప్రాంతాలను గుర్తించి, అక్కడ నివసిస్తున్న ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరద ప్రవాహ సమయంలో కాలువలు, చెరువులు వంటి జల వనరుల వద్దకి వెళ్లకూడదని, వాటిని దాటేందుకు ప్రయత్నించరాదని స్పష్టం చేశారు. అలాగే రహదారులు, కాల్వట్ల పై నీరు ప్రవహిస్తున్న చోట్ల అధిక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు కలుషితమయ్యే అవకాశాన్ని నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని నీటి సరఫరా అధికారులను సూచించారు. వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఖమ్మం నగరంలో మొక్కల నాటింపు



**ఖమ్మం సిటీ, మహా:** ఖమ్మం నగర పాలక సంస్థ పచ్చదనం పెంపుదలపై దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా నగరంలోని ప్రధాన రహదారుల డివైడర్లలో వోక్క (ఆరెకానట్) మొక్కలను నాటే కార్యక్రమం ప్రారంభించింది. ఈ మొక్కలు నగరానికి పచ్చదనంతో పాటు, శుభ్రమైన వాతావరణాన్ని అందిస్తాయని అధికారులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే ఈ చర్య మున్ముందు మున్సిపల్‌కు ఆదాయ వనరుగా కూడా మారే అవకాశం ఉంది. డివైడర్లపై ఈ మొక్కల నాటింపు ద్వారా నగరం మరింత అందంగా మారుతుందని, పారిశుద్ధ్యం కూడా మెరుగవుతుందని అధికారులు భావిస్తున్నారు.

## వరదలపై ముందస్తు ప్రణాళిక



**ఖమ్మం, మహా:** ఖమ్మం నగరంలో ఇటీవల తేలికపాటి నుంచి భారీవర్షాలు కురుస్తుం డటంతో, మున్నేరు నదిలో వరదల సంభవించే ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని నగర పాలక సంస్థ అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధ్యక్షతన ఖమ్మం మున్సిపల్ కార్యాలయంలో జాతీయ విపత్తు ప్రతిస్పందనా దళం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరదల సమయంలో ప్రమాదానికి లోనయ్యే ప్రాంతాలను గుర్తించడం, ప్రజలకు ముందస్తు హెచ్చరికలు అందించడం, అవసరమైతే రక్షిత ప్రాంతాలకు తరలింపు చర్యలు చేపట్టడం వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా మున్నేరు పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, రెస్క్యూ టీంలను ముందస్తుగా సిద్ధం చేయాలని నిర్ణయిం చారు.

## ఉత్సాహంగా టియుడబ్ల్యూజె జిల్లా మహాసభలు



**ఖమ్మం , మహా:** టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మం జిల్లా నాల్గవ మహాసభలు అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగాయి. వైరాలోని శబరి గార్డెన్స్ జరిగిన మహాసభల్లో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఏనుగు వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా –మైసా పాపారావు, కోశాధికారిగా నాగండ్ల శివానంద లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, పాపారావులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ప్రధానంగా అక్రిడేషన్లు, హెల్త్ కార్డులతో పాటు ప్రధానంగా నివాస –స్థలాల సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యక్షులుగా సామినేని కృష్ణమురారి, ఎస్ కె మోహినుద్దీన్, పోలంపల్లి –నాగేశ్వరరావు, తాతా శ్రీనివాసరావు, గోపాలరావు, సహాయ కార్యదర్శులుగా ఖాదర్, సత్యనారాయణ, బాలస్వామి, ఆలస్యం అప్పారావు, "ఆనం చిన్ని రామారావుతో పాటు జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

## అధికారుల నిర్లక్ష్యం.... చెరుకు రైతుకు శాపం...!



**నేలకొండపల్లి, జూలై 25 మహా:** అధికారుల నిర్లక్ష్యం... చెరుకు రైతుకు శాపంగా మారింది...కాలువ కట్ట పక్కన పంట కాలువ తీయకపోవటం...స్థలం ఆక్రమణ కు గురి కావటం..ర్యాంపు వలన చెరుకు రైతు నిండా మునిగిపోయాడు...వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని అమ్మగూడెం గ్రామానికి చెందిన అడపాలు, రమేష్బాబు అనే రైతు కు రెండున్నర ఎకరాల చెరుకు ఉంది. నందిగామ బ్రాంచి కెనాల్ పక్కన ఉన్న పొలం కు పంట కాలువ లు లేకపోవటంతో –వరద నీరు అంతా సదరు రైతు పొలంలోకి చేరుతుంది. కాగా గ్రామానికి చెందిన మరో రైతు వరద నీరు వెళ్లకుండా ర్యాంపు ఏర్పాటు చేసుకున్నారు. దీని వలన రైతు వేసుకున్న బుర్ర కూడ పూడ్చారు. దీంతో వచ్చిన నీరంతా బాధిత రైతు పొలంలోనే నిలుస్తుంది. దాదాపు రూ.2 లక్షల వరకు సాగు ఖర్చుల కోసం అప్పులు చేశాడు. ప్రస్తుతం చెరుకు నీరు నిలిచి కుళ్లిపోయే అవకాశం ఉంది. ఇరిగేషన్, రెవిన్యూ అధికారులకు తమ గోడు చెప్పినా పట్టించుకోవటం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

05
FOLLOW: @ANNTELUGU
26-7-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# నేపాల్‌కు పారిపోయిన బంగారం దొంగలు

## దేశవ్యాప్తంగా పోలీసుల ముమ్మర వేట

**ఖమ్మం, మహా:** తెలంగాణ రాష్ట్రంలో సంచలనం రేపిన బంగారం దొంగల ముఠా పట్టుకునేందుకు పోలీసులు దేశ వ్యాప్తంగా వేటను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో బంగారం దొంగతనానికి పాల్పడి, ఖమ్మం మీదుగా ఢిల్లీకి పారిపోయిన ఈ ముఠా ప్రస్తుతం నేపాల్ సరిహద్దుల్లో దాగి ఉందన్న సమాచారం మేరకు గాలింపు చర్యలు మరింత ఉత్కంఠ రేపుతున్నాయి.

### సెల్‌ఫోన్ సిగ్నల్స్‌తో జాడ పట్టిన పోలీసులు

బంగారం దొంగల ముఠా కిరాయికి తీసుకున్న ఇంటిని గుర్తించిన పోలీసులు, అక్కడ లభించిన ఆధారాలతో ముఠాను వెంబడించటం ప్రారంభించారు. నిందితుల సెల్‌ఫోన్ టవర్ లొకేషన్లు విశ్లేషించగా, ఢిల్లీలో చివరి సిగ్నల్స్ లభించాయి. అక్కడి నుంచి అర గంట వ్యవధిలోనే నేపాల్ సరిహద్దుల్లో వారి ఫోన్‌లు ఆఫ్ కావడంతో దొంగలు దేశ సరిహద్దులను దాటినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### నేపాల్‌కు పారిపోతూ ఖమ్మం గుండా పయనం.

సూర్యాపేటలో దొంగతనానికి పాల్పడి, ఖమ్మం మీదుగా రైలు మార్గంలో ఢిల్లీ చేరుకున్న ముఠా అక్కడి నుంచి నేపాల్‌కు పారిపోయినట్టు అధికారులు తేల్చారు. ముఠాలోని ఇద్దరు సభ్యులు నేపాల్ వాసులుగా గుర్తించబడటం విశేషం. దీంతో అంతర్జాతీయ చట్టాల ప్రకారం వారికి ఆశ్రయం లభించే అవకాశం ఉందన్నది పోలీసులకు కొత్త సవాలుగా మారింది.

### ఖమ్మంలో అదుపులోకి తీసుకున్న దంపతుల నుంచి కీలక సమాచారం

ఈ కేసులో కీలకంగా మారిన మరో అంశం ఖమ్మం జిల్లాకు చెందిన ఓ దంపతుల అదుపులోకి రావడమే. వారిచ్చిన సమాచారం ఆధారంగా ఐదుగురు నిందితుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయనను విచారిస్తున్న పోలీసులు, మిగతా నలుగురు దొంగలు నేపాల్‌కు పారిపోయినట్లు నిర్ధారించుకున్నట్లు సమాచారం. నిందితుల సమాచారం మేరకు, తెలంగాణ పోలీసు బృందాలు ఇప్పటికే నేపాల్ సరిహద్దులో ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. అదే సమయంలో మరో రెండు బృందాలు ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లోనూ తనిఖీలు జరుపుతున్నాయి.

### అంతర్జాతీయ స్థాయిలో నిఘా

తెలంగాణలో జరిగిన ఈ భారీ చోరీ కేసు అంతర్జాతీయ ముఠాలతో సంబంధముందని అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఫోరెన్సిక్, సైబర్ విభాగాలు కలిసి ఈ కేసును విస్తృతంగా దర్యాప్తు చేస్తున్నాయి. నేపాల్ ప్రభుత్వం సహకారంతో నిందితుల పట్టివేతకు ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

### సాంకేతిక నిపుణతతో దర్యాప్తు...

ఈ దొంగల ముఠా కచ్చితమైన ప్రణాళికతో పని చేసినట్టు కనిపిస్తున్నా, వారి తప్పిదమే పోలీసులకు కీలకంగా మారింది. సెల్‌ఫోన్ ఉపయోగించడం, ఖమ్మం మీదుగా ప్రయాణం చేయడం వంటి అంశాలపై పోలీసులు నిశితంగా దర్యాప్తు చేసి, ఒకరి దొరికింపుతో మిగిలిన వారి ఆచూకీ తెలుసుకున్నారు.

### నిందితులను పట్టుకుంటామని పోలీసుల భరోసా

ఈ కేసుపై పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగుతోందని, నిందితుల్ని తప్పించుకోలేకుండా చేయడానికి అన్ని మార్గాలనూ వినియోగిస్తున్నామని పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించారు. మరికొద్ది రోజుల్లోనే ముఠాను పట్టుకునే అవకాశముందని సమాచారం.

# భూ భారతి దరఖాస్తులను ఆన్లైన్‌లో నమోదు చేయాలి



**ఖమ్మం, మహా:** భూ భారతి క్రింద భూ సమస్యల పరిష్కారానికి స్వీకరించిన దరఖాస్తుల ఆన్లైన్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్ కామేపల్లి, సింగరేణి మండలాల తహసీల్దార్ కార్యాలయాలను శుక్రవారం తనిఖీ చేసి, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు. దరఖాస్తులకు సంబంధించి భూ భారతి ఆన్లైన్ పోర్టల్ లో నోటీసుల జారీ చేయాలన్నారు. భూ భారతి పోర్టల్ నియమ నిబంధనల మేరకు దరఖాస్తులపై పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. దరఖాస్తులకు నోటీసులు జారీ, ఆన్లైన్ నమోదు ప్రక్రియ పై అదనపు కలెక్టర్, అధికారులకు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ తనిఖీ సందర్భంగా కామేపల్లి, సింగరేణి మండల తహసీల్దార్లు సిహెచ్. సుధాకర్, ఏ. రమేష్, అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# తల్లాడ ఆసుపత్రిని సందర్శించిన అదనపు కలెక్టర్ శ్రీజ



**తల్లాడ, జులై,25, ( మహా):** తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా వైద్య అధికారి కళావతి భాయ్ శుక్రవారం సందర్శించారు. అనారోగ్యంతో మృతిచెందిన యోగా ట్రైనర్ కందుల శ్రీదేవి మృతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ల్యాబును వారు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డాక్టర్ ప్రాథమిక వైద్యులు రత్న మనోహర్ ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా శ్రీదేవి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట డిప్యూటీ డిఎంహెచ్ వో సీతారాం, ఎంపీడీవో సురేష్ బాబు, తల్లాడ మేజర్ పంచాయతీ కృష్ణారావు, తదితరులు ఉన్నారు.

# తెలంగాణలో ప్రత్యేక అధికారుల నియామకం

**ఖమ్మం, మహా:** తెలంగాణ రాష్ట్ర పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకాలు నేడు జారీ చేసిన జీఓ నంబర్ 999 ద్వారా అధికారికంగా అమల్లోకి వచ్చాయి. గతంలో వెలువడిన నాలుగు జీవోలకు ఇది పరిమిత మార్పుల రూపంలో కొనసాగింపుగా ఉంది. నియమితులైన అధికారులు తక్షణమే తమ నియమిత జిల్లాలలో జిల్లా కలెక్టర్లతో సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలును పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ నిర్ణయంతో పాలనలో సమర్థత పెరిగే అవకాశముంది. నియమితులైన ఐఏఎస్‌లు తమ అనుభవంతో స్థానిక సమస్యలను సమర్థంగా గుర్తించి, త్వరిత పరిష్కార మార్గాలను నిర్దేశించగలుగుతారు. అలాగే జిల్లాల్లో నాణ్యమైన సేవల కోసం స్థానిక శాఖలపై సమీక్షలు నిర్వహించడం, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై మానిటరింగ్ చేయడం వంటి బాధ్యతలు వీరిపై ఉండనున్నాయి.

# విద్యార్థులు మొక్కలు పెంచటం మంచి అలవాటు



**నేలకొండపల్లి, జులై 25 మహా:** విద్యార్థులు మొక్కలు పెంచటం మంచి అలవాటు ప్రతీ ఒక్కరూ అలవర్చుకోవాలని సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల ప్రిన్సిపాల్ మిక్కిలి జోసెఫ్ సూచించారు. మండల కేంద్రంలోని కొత్తకొత్తూరు పాఠశాల కు చెందిన విద్యార్థి షేక్ కుదుష్యా పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..ప్రతీ పుట్టిన రోజు సందర్భంగా మొక్కను నాటటం చాలా మంచి అలవాటు అన్నారు. పుట్టిన రోజు పేరుతో డబ్బులు వృధా చేయటం..సమయం ను వృధా చేస్తున్న తరుణంలో చిన్నారి మొక్కను నాటే లక్ష్యం ను ఎంచుకోవటం చాలా సంతోషం అన్నారు. చిన్నారి ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నారి తండ్రి షేక్ బాసింసాహెబ్, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు సైబర్ నేరస్థులు అరెస్టు

**ఖమ్మం , మహా :** మీ ఆధార్ కార్డ్ ద్వారా సిమ్ములు తీసుకొని చట్ట వ్యతిరేక కార్యకలాపాలు , జాబ్ ఫ్రాడ్స్ , మనీలాండరింగ్ జరిగాయని, ఈ కేసులలో అరెస్టు చేస్తామని నేతాజీ నగర్ ఖమ్మం అర్బన్ మండలం కి చెందిన రిటైర్డ్ ఉద్యోగి ని బెదిరించి, డిజటల్ అరెస్టు చేసి సుమారు 59 లక్షల రుపాయలు మోసం చేసిన కేసులో ముగ్గురిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు అనంతపురం , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అరెస్టు చేసినట్లు ఖమ్మం సి.పి. సునిల్ దత్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం అర్భన్ మండలానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడుని ఫోన్ లో జాబ్ ఫ్రాడ్స్ , మనీలాండరింగ్ కి పాల్పడ్డారని, బెంగళూరు పోలీసులమని, డిజిటల్ అరెస్టు చేస్తామని బెదిరించి ఏప్రిల్–2025 లో ఫలుదఫాలుగా సుమారు 59 లక్షలు రూపాయలు దోచుకున్న కేసులో రూ. 9 లక్షలు అకౌంట్ కి వెళ్ళిన డీ యెర్రి స్వామి, వయస్సు 35 సం,లును అరెస్ట్ చేసి విచారించగా తను , ఇంకో ఇద్దరు ఈ. లక్ష్మానాయక్ , వయస్సు 35 సం" లు మరియు కె .నారాయణ రెడ్డి, వయస్సు 49 సం"లు కలిసి నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. అట్టి ముగ్గురిని అనంతపురం లో అరెస్ట్ చేసినట్లు, ముగ్గురు నిందితులను ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరచి, రిమాండ్ కి తరలించారని తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించి, ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం లో నిందుతుల్ని అరెస్టు చేసి, ఖమ్మంకి తీసువచ్చి, రిమాండ్ చేసిన సైబర్ క్రైం ఇన్– ఛార్జి డి.ఎస్పి. టి లక్ష్మినారాయణ కి, ఇన్స్పెక్టర్ యాసిన్ అలీ ని, ఎస్సైలు రంజితకుమార్, సహకరించిన ఎస్సై విజయ్ కుమార్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఖమ్మం సి.పి. అభినందించారు.

# వన మహోత్సవం ప్రారంభం

**సత్తుపల్లి, మహా:** సత్తుపల్లి పట్టణ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారుల డివైడర్లపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ , రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ – "వాతావరణం సమతుల్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి. వర్షాలు సరైన సమయంలో కురవాలి అంటే ప్రకృతి మనకు అనుకూలంగా ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం అనేది ఈ దిశగా తీసుకున్న మంచి చర్య" అని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కమిషనర్, సిబ్బంది పాల్గొన్నారు.



# వైద్య సేవల పట్ల కలెక్టర్ అసంతృప్తి...!





**నేలకొండపల్లి, జూలై 25 మహా :** స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్య సేవలు పట్ల జిల్లా కలెక్టర్ అనుదీఫ్ దురిశెట్టి అసంతృప్తిని వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను ఆకస్మింకగా తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. వార్డులకు వెళ్లి పరిశీలించారు. ఓపీ లో వెయిట్ చేస్తున్న రోగుల వద్దకు వెళ్లి పలకరించారు. ఎక్కడి నుంచి వచ్చారు..ఏమైంది అమ్మా అంటూ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది తో ప్రత్యేకంగా మాట్లాడారు..సీహెచ్సీ లో ఈ నెలలో కేవలం రెండు కాన్పులు చేయటం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. సరిపడా వైద్యులు. సిబ్బంది, సౌకర్యాలు ఉన్నప్పటకీ ఎందుకు కాన్పులు చేయలేకపోతున్నారని వైద్యులను అడిగారు. ప్రశ్నించారు. అసంక్రమిత వ్యాధుల రోగుల వివరాలు ఆన్లైన్ లో ఎందుకు నమోదు చేయటం లేదన్నారు. హస్పిటల్ లో 50 మందికి గాను, కేవలం 33 మంది మాత్రమే ఆన్లైన్ అటెండ్ వేశారని... మిగతా వారంతా ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. ఆన్లైన్ హాజరు తప్పకుండా వేయాలని ఆదేశించారు. టీకాల కార్యక్రమం 95 శాతం మాత్రమే జరుగుతుందని... మిగిలిన 5 శాతం కూడ పూర్తి చేయాలని అన్నారు. మన జీవితం ఎలా ఉండాలి అనేది మన పైనే ఆధారపడి ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆనుదీప్ దురిశెట్టి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీను ఆకస్మికంగా తనీఖీ చేశారు. ప్రహరీగోడ నిర్మాణం కు ప్రతిపాధనలు పంపాలని ఆదేశించారు. తరగతి లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు...ఇంటర్ పరీక్షలతో పాటు విద్యార్థులు ఇతర ప్రవేశపరీక్షలకు కూడ సన్నద్ధం కావాలని సూచించారు. పోటీ పరీక్షలలో రాణిస్తామో లేదా అనే అనుమానాలు మైండ్ నుంచి తీసి వేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను వారం రోజులలో అందుబాటులో పెడతామని తెలిపారు. తమ సమయం ను రీల్స్ చూస్తు వృధా చేయకుండా కాన్సెప్ట్ లను నేర్చుకోవటం లో శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఒత్తిడి ని తట్టుకున్న తరువాతనే వజ్రం తయారు అవుతుందని అదే విధంగా మనకు కష్టం వచ్చినప్పుడు కుంగిపోకుండా ధైర్యంగా నిలబడితే విజయం సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తదితరలు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన వైరా ఎమ్మెల్యే





**కారేపల్లి, మహా :** వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కారేపల్లి మండలంలో కాంగ్రెస్ కార్యకర్తలు పలు కార్యక్రమాలను నిర్వహించారు. కారేపల్లి సంత అవరణం, కారేపల్లిలో దుగ్గినేని చంద్రశేఖర్ నూతనంగా ప్రారంభించిన వెంచర్ లో వైరా ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కారేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను జరిపారు. ఎమ్మెల్యే కేక్ కట్ చేయగా నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మేకల తండాలో బానోత్ రామ్మూర్తి నాయక్ ఆధ్వర్యంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పుట్టిన రోజు వేడుకను జరిపారు. ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి గ్రామస్తులకు స్వీట్లు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో అధికారులు ఇన్చార్జి ఎంపీడీవో మల్లెల రవీందర్ ప్రసాద్, ఏపీవో కోటేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్ రావు, పంచాయతీ కార్యదర్శులు, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, పగడాల మంజుల, ప్రముఖ వ్యాపారవేత్త వాణిజ్య విభాగ జిల్లా ఉపాధ్యక్షులు సురేందర్ మనియర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్,ఇమ్మడి తిరుపతిరావు, మేదరి టోనీ, అడ్డగోడ ఐలయ్య, భీముడు నాయక్,బానోతు దేవుల నాయక్ ,డాక్టర్ పర్సా పట్టాభి రామారావు,ఈశ్వరినందరాజ్, పెద్దబోయిన ఉమాశంకర్, పొలగాని శ్రీనివాస్, సంతోష్ నాయక్, కబీర్, భూక్య శ్రీకాంత్, భూక్య కుమార్, మేదరి రాజా,దేవదాయ శాఖ సిబ్బంది మూడ్ మోహన్ చౌహన్, తరులు పాల్గొన్నారు.

## చదువుపై దృష్టి పెడితే ఏదైనా సాధించవచ్చు



**నేలకొండపల్లి, మహా:** మన జీవితం ఎలా ఉండాలనేది మన పైనే ఆధారపడి ఉంటుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం తనిఖీ చేశారు. కళాశాల పరిసరాలను తిరిగి ప్రహరీగోడ నిర్మాణంతో పాటు విద్యార్థులకు కల్పించ వలసిన సౌకర్యాలకు ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్, ఆధికారులను ఆదేశించారు. అనంతరం తరగతి గదిలో జరుగుతున్న విద్యా బోధనను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ తాను ప్రభుత్వ విద్యనే అభ్యసించి అనుకున్న లక్ష్యాన్ని సాధించానని కలెక్టర్ హితబోధ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఇంటర్ బోర్డు పరీక్షలతో పాటు విద్యార్థులు జేఈఈ, నీట్ వంటి ప్రవేశ పోటీ పరీక్షలకు కూడా సమాంతరంగా సన్నద్ధం కావాలని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నాం, మనం పోటీ పరీక్షల్లో రాణిస్తామో లేదో అనే అనుమానాలను విద్యార్థులు పూర్తి స్థాయిలో మైండ్ నుంచి తీసివేయాలని కలెక్టర్ తెలిపారు.

## జ్వర బాధితులను సిబ్బంది పర్యవేక్షణ చేయాలి



**ఖమ్మం, మహా:** ప్రతి ఫీవర్ కేసును వైద్య సిబ్బంది ఫాలో అప్ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, శుక్రవారం సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల వ్యాప్తి అరికట్టేందుకు పారిశుద్ధ్య నిర్వహణ చాలా కీలకమని అన్నారు. మండలంలో వైద్య అధికారి, ఎంపిడిఓ, ఎంపిఓ సమన్వయంతో పని చేయాలని, క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు ఫీల్డ్ లెవల్ అందుబాటులో ఉండాలని అన్నారు. సీజనల్ వ్యాధులు లక్షణాలు గల వారికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, వ్యాధికి గురైన వారికి చికిత్స అందించడంతో పాటు ఆ ప్రాంతంలో ఫీవర్ సర్వే నిర్వహించాలని, ఆ ప్రాంతంలో 150 ఇండ్లకు అన్ని వైపులా ఫాగింగ్ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

## కలుపు ముందు సేవించి వ్యక్తి మృతి

**టేకులపల్లి - మహా :** టేకులపల్లి మండలం అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది కలుపు మందు తాగి మృతి చెందిన వ్యక్తి మహిళ ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం మద్రాస్ తండా గ్రామానికి చెందిన బానోతులక్ష్మి భర్త మంగ్యతా 64 సంవత్సరాల ఈనెల 17వ తారీఖున కలుపు మందు తాగగా చికిత్స నిమిత్తం ఖమ్మంలోని కిమ్స్ హాస్పిటల్ లో చేర్పించారు చికిత్స పొందుతూ మృతి చెందారు లక్ష్మి కుమారుడు వినోద్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు

## రెవిన్యూ సదస్సు దరఖాస్తుల అన్‌లైన్ వేగవంతం చేయాలి

**కారేపల్లి, మహా :** సింగరేణి తహసీల్దార్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం సందర్శించారు. భూభారతి రెవిన్యూ సదస్సులు సందర్భంగా వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ పక్రియను ఆయన పరిశీలించి సూచనలు చేశారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలన్నారు. దరఖాస్తులు సక్రమంగా లేకుంటే దానికి సంబంధించి దరఖాస్తుదారునికి నోటీస్ ఇచ్చి పూర్తి సమాచారాన్ని తీసుకున్న తర్వాత చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి దరఖాస్తుపై నియమనిబంధనలు అనుగుణంగానే చర్యలు ఉంటాయన్నారు. భూభారతిలో కాలంలకు అనుగుణంగా రెవిన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిశీలన ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్ధార్ అనంతుల రమేష్, డీటీ కృష్ణయ్య, ఆర్ఐ సామినేని నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## తేనెటీగల పెంపకం శిక్షణా కార్యక్రమం



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 25 (మహా):** జి కె ఓసి మరియు వి కె కోల్ మైన్ ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు అందించడం సింగరేణి సంస్థ మేనేజ్‌మెంట్‌కు ఒక సామాజిక బాధ్యతా భావానికి ప్రతీక. సింగరేణి సి ఎండి ఎన్. బాలరాం మార్గదర్శకత్వంలో కొత్తగూడెం ఏరియా జిఎం ఎం షాలెం రాజు అధ్వర్యంలో చేపట్టిన తేనెటీగల పెంపకం శిక్షణా కార్యక్రమం ఒక మైలురాయిగా నిలిచింది. “సిఎస్ ఆర్” కార్యక్రమం కింద మనబ్ కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ, త్రిపుర సహకారంతో 100 మంది మహిళలు ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకొని, మూడు రోజుల సమగ్ర శిక్షణను విజయవంతంగా పూర్తి చెసిన సందర్భంగా శుక్రవారం ఆర్.సి.ఓ.ఏ క్లబ్ రుద్రంపూర్లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి జిఎం ముఖ్య అతిదిగా హాజారయ్యారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ, తేనెటీగల పెంపకం %-% ప్రకృతి , పంటల రక్షకుడు మరియు తేనె అనేది ఆరోగ్యాన్ని కాపాడే సహజ ఆహార పదార్థం మాత్రమే కాకుండా ప్రతిరోజు మన ఆరోగ్య జీవన శైలికి ఎంతో తోడ్పడుతుందని తేనెటీగల పరాగసంపర్కం (పోలినేషన్) ద్వారా వ్యవసాయ పంటల దిగుబడి పెరుగుతుందని, రైతులకు అధిక ఆదాయం లభిస్తుంది, పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో తేనెటీగల పాత్ర అనివార్యం, అందువల్ల ఈ వ్యవసాయ పద్ధతి ప్రకృతితో మమేకమయ్యే ఒక సుస్థిర మార్గం అన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎల్‌డి సత్తా చాటుదాం

- విలువలు గల రాజకీయాల కోసం యువతే ప్రాధాన్యత
- ప్రజల్లో చైతన్యం కోసం పాదయాత్ర చేపడుతాం
- విలేకరుల సమావేశంలో.. టి ఆర్ ఎల్ డి రాష్ట్ర అధ్యక్షులు.. మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్



మహా న్యూస్, కొత్తగూడెం: తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడటంలో యువత ముందుండాలని అన్ని వర్గాల ప్రజలకు సముచితమైన న్యాయం కల్పించాలంటే యువతను ప్రోత్సహిస్తూ జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ సత్తా చాటేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని అందుకుగాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా త్వరలో పాదయాత్ర చేపడతామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఉర్దూఘర్లో ఏర్పాటు చేసిన ఆ పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రెండు ప్రధాన పార్టీలు అధికారంలో ఉండి అభివృద్ధిలో ఆగమాగం చేశారని యువతకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు అందుకోసమే యువతకు ప్రాధాన్యత కల్పిస్తూ జరగబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో టిఆర్ ఎల్ డి పోటీ చేస్తుందని తెలిపారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా యువత ప్రముఖ పాత్ర పోషించాలని అందుకుగాను ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు జరప తలపెట్టిన పాదయాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిపై రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో టి ఆర్ ఎల్ డి ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా జాబు మేళాలను నిర్వహించి అర్హత గల నిరుద్యోగులను ఉద్యోగాలు ఇప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. యువత రాజకీయాల్లోకి ఎదిగేందుకు ప్రత్యేక శిక్షణను కూడా ఇస్తున్నామని అన్నారు. జరగబోయే ఎన్నికల్లో టి ఆర్ ఎల్ డి విజయం కోసం శక్తి వంచన లేకుండా యువత శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కట్ట సతీష్, బీసీ సంఘం జిల్లా నాయకులు అంకినీడు ప్రసాద్, టి ఆర్ ఎల్ డి జిల్లా బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

కారేపల్లి, మహా: కారేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాస్ నాయక్ ,జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.పార్టీ కార్యకర్తలు డోలుబాజాల నృత్యాల నడుమ టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు.మండల పార్టీ కార్యాలయం ఎదుట భారీ కేక్ కట్ చేసి,స్వీట్లు పంచారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాజీవితంలో అనేక కష్ట నష్టాలు ఎదుర్కొని రాజకీయాలలో నిలబడి ప్రజల దీవెనలతో ఎమ్మెల్యేగా గెలుపొందాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి చేరవేసేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్, మహిళా నాయకురాలు పగడాల మంజుల,సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు,డైరెక్టర్లు అడ్డగోడ ఐలయ్య,బానోతు హీరాలాల్, జిల్లా వాణిజ్యవిభాగం ఉపాధ్యక్షులు సురేందర్ మనియార్,ఇమ్మడి తిరుపతిరావు,బానోత్ రామ్మూర్తి నాయక్,మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేదరి వీరప్రతాప్(టోనీ),మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లానాయక్ ,పెద్దబోయిన ఉమాశంకర్,సొసైటీ డైరెక్టర్ దేగల ఉపేందర్,గుగులోత్ భీముడు నాయక్,ఆలోతు ఈశ్వరి బాయి, టౌన్ ప్రెసిడెంట్ పోలగాని శ్రీనివాస్ గౌడ్,హేమలత,నాగవేణి, సపావట్ నాగులు,ఈసాల ఛాయాదేవి,మాజీ సర్పంచులు వాంకుడోతు కృష్ణ,కురుసం సత్యనారాయణ, ఆంగోత్ మత్రు నాయక్,యూత్ ప్రెసిడెంట్ హర్ష నాయక్,మేదరి రాజా,భావుసింగ్, మజీద్ పాషా,తొగర శ్రీను,ఎండి హనీఫ్,ఎంపీడీవో మల్లెల రవీంద్ర ప్రసాద్, ఏపీవో కోటేశ్వరరావు, నరేంద్ర రావు,ఎస్సై బైరు గోపి,వివిధ శాఖల అధికారులు,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# ఉప్పొంగుతున్న గోదావరి

భద్రాచలం,, మహా: తెలంగాణ రాష్ట్రం అంతటా, ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి నది అలుముకుంటోంది. గడిచిన కొన్ని రోజులుగా తెలంగాణతో పాటు మహారాష్ట్రలో కురుస్తున్న అతి భారీ వర్షాల ప్రభావం గోదావరి నదిలో స్పష్టంగా కనిపిస్తోంది. గోదావరి ఉపనదులైన ప్రాణహిత, ఇంద్రావతి నదులు విరిగిపడి పోతూ గోదావరిలో కలుస్తుండటంతో, భద్రాచలం వద్ద వరద ఉధృతి భయానకంగా మారుతోంది. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో గోదావరి జలమట్టం 21 అడుగులుగా నమోదైంది. అయితే కేవలం 12 గంటల వ్యవధిలోనే నది నీటి మట్టం 25.60 అడుగులకు చేరుకుంది. ఇది ఒకరోజు వ్యవధిలో పెద్ద ఎత్తున పెరిగిన ఉదాహరణగా చెప్పుకోవచ్చు. గోదావరి దిగువకు 3,04,405 క్యూసెక్కుల నీరు చేరినట్లు అధికారులు తెలిపారు. వరద ప్రవాహం అత్యంత వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో నది పరివాహక ప్రాంతాల ప్రజలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



### తాలిపేరు ప్రాజెక్ట్ నుంచి భారీగా నీటి విడుదల

భద్రాచలం ఏజెన్సీలోని చర్ల మండలంలో ఉన్న తాలిపేరు ప్రాజెక్ట్‌కు పెద్ద ఎత్తున వరద నీరు చేరింది. దీంతో ప్రాజెక్ట్ నుంచి 7 గేట్లు ఎత్తి మొత్తం 18,659 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. ఇందులో ఒక గేటు 2 అడుగుల మేర, మరో గేటు 3 అడుగుల మేర, మిగిలిన ఐదు గేట్లు పూర్తిగా ఎత్తి నీరు వదిలారు.

### కిన్నెరసాని నుంచి కూడా వరద నీటి ఉధృతి

అలాగే, కిన్నెరసాని ప్రాజెక్ట్‌కి కూడా వరదనీరు భారీగా చేరడంతో అధికారులు రెండు గేట్లు ఎత్తి 8,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. వరద ఉధృతి పెరిగే అవకాశం ఉండటంతో ప్రాజెక్టు ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు వెలువడ్డాయి.

### అప్రమత్తంగా ఉండండి - అధికారుల సూచనలు

గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు, నదీ తీరం వెంట నివసిస్తున్నవారు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని జిల్లా అధికారులు సూచిస్తున్నారు. వరద తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున, ఎలాంటి అప్రమత్తత లేకుండా వ్యవహరించకూడదని హెచ్చరిస్తున్నారు.

### తాత్కాలికంగా ప్రణాళికలు సిద్ధం

ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, రెవెన్యూ, పోలీస్ శాఖలు ఇప్పటికే గోదావరి పరివాహక ప్రాంతాల్లో బస చేసి అప్రమత్తంగా ఉన్నాయి. అవసరమైతే పునరావాస కేంద్రాలు తెరచేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడెక్కడ ప్రమాద పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందో అక్కడ దృష్టి పెట్టి, ప్రజల రక్షణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# ఎం.పి.ఓ వ్యాఖ్యల కలకలం

బోనకల్,మహా: గోవిందపురం గ్రామాన్ని మరోసారి కలకలం చుట్టేసింది. గ్రామ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్న మాజీ సర్పంచ్ ఉమ్మినేని బాబు, ఆయన కుమారుడు ఉమ్మినేని రమేష్‌పై ఎం.పి.ఓ చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. ప్రజా సేవా పట్ల కట్టుబాటుతో ఉన్న ఈ తండ్రీకొడుకులపై ఎం.పి.ఓ శాస్త్రి చేసిన వ్యాఖ్యలు నిబంధనలకు వ్యతిరేకమని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం పార్టీ నాయకులు టిఆర్ఎస్ స్థానిక నాయకులతో కుమ్మక్కై ఉమ్మినేని కుటుంబంపై దుష్ప్రచారం చేస్తూ, వారిని సమాజంలో అపకీర్తిపాలుచేసేలా ప్రవర్తిస్తున్నారని గ్రామ ప్రజలు ఆరోపించారు. ప్రత్యేకంగా గ్రామ అభివృద్ధికి వినూత్న ప్రణాళికలు రూపొందించి, వాటి అమలులో ఉన్న ఉమ్మినేని రమేష్‌ని ఓర్వలేని వర్గాలు కావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వాపోయారు. గత రెండు సంవత్సరాలుగా గోవిందపురం గ్రామ ప్రజలు రామాలయం నిర్మాణానికి సంబంధించి అధికారులను పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా, స్పందన రాలేదు. చివరకు మహా పత్రిక లో వచ్చిన ప్రత్యేక కథనాన్ని తరువాతే జెసిపిలను ఏర్పాటు చేసి ఆలయం గోడ కూల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో గ్రామ ప్రజలు స్పందించి అడ్డుకున్న సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీనికి ప్రతీకారంగా ఎం.పి.ఓ శాస్త్రి, సిపిఎం నాయకులతో కలిసి, తప్పుడు కథనాలు తయారు చేసి వీడియోలు తీసి ప్రచారం చేయడం ఆగ్రహానికి దారి తీసింది. ఈ వివాదంలో మధిర సీఐ, బోనకల్ ఎస్ఐ సమీక్ష పేరుతో గ్రామస్తులను బెదిరించారని, ఎం.పి.ఓ ఆరోపణలు చేస్తూ తన వైఖరిని సమర్థించుకునే ప్రయత్నం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఇది పూర్తిగా అసత్యమని, ప్రజల నమ్మకాన్ని కుదేలు చేయాలని జరుగుతున్న కుట్రలో భాగమని గ్రామ ప్రజలు స్పష్టం చేస్తున్నారు. శుక్రవారం గ్రామ ప్రజలు ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి కలిసి, ఎం.పి.ఓ శాస్త్రిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిపిఓకు వినతిపత్రం సమర్పించారు. ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా, సమాజంలో విభజనలకు దారితీసే విధంగా వ్యవహరించిన ప్రభుత్వాధికారిని ఊరించకూడదని, ఇది బహిరంగంగా ప్రజాస్వామ్యంపై దాడి అని వారు హెచ్చరించారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రజా సంఘాలు, యువజన సంఘాలు సంఘటితమై మద్దతుగా నిలవడానికి సిద్ధమవుతున్నాయి. ప్రభుత్వానికి వాస్తవాలు వెల్లడి చేసి, ఈ వ్యవహారంలో పాలుపంచుకున్న అధికారులు, పార్టీ వర్గాలపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నారు.

